క్లుప్తంగా

ఆర్యవైశ్య మహాసభ అదనపు ప్రధాన కార్యదర్శిగా నాగన్న



నియామకపత్రం అందుకుంటున్న నాగన్న

నడిగూడెం : ఆర్యవైశ్య మహాసభ జిల్లా అదనపు కార్యదర్శిగా నడిగూడెంకు చెందిన నూనె నాగన్న నియమితులయ్యారు. శుక్రవారం నడిగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు నాగన్నకు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్యవైశ్య సభ నాయకులు పాల్గొన్నారు.

గరుకు స్తంభానికి పూజలు



పూజలు చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని శివాలయంలో గోమాతల సేవ కోసం వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం గరుకు స్తంభం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఉగ్రదండి శివప్రసాద్‌శర్మ గరుకు స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్‌ల సభ్యులు విజయలక్ష్మి, కందిబండ శ్రీనివాస్‌రావు, కందిబండ వాసంతి, కొత్త లక్ష్మణ్, శ్రీలత, కోటేశ్వర్‌రావు, సుమంత్, జ్యోతి, చెరుకు కవిత, వాసు, ఊర్మిల, రాము, నటరాజ్, సుధాకర్, స్వామి, అశోక్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మునగాల : కోదాడ పట్టణంలోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేటు ఎదుట ఈనెల 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్ కాంపౌండబుల్, సివిల్ తగాదా, ఆస్తి విభజన, కుటుంబపరమైన, మోటారు, ట్రాన్స్‌పోర్టు, రోడ్డు నియమాల ఉల్లంఘన, వైవాహిక జీవితా నికి సంబంధించినవి, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ తదితర కేసులకు సంబంధించి కక్షిదారులు రాజీ పడొచ్చని తెలిపారు. తమ కేసులలో రాజీ పడాలి అనుకున్నవారు పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవచ్చు

మునగాల : రైతు భరోసా కోసం కొత్తగా పట్టదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బుంగా రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 05, 06, 2025 లోపు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు, గతంలో పట్టాదారు పాసుపుస్తకం వచ్చి ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు ఈనెల 20 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతు భరోసా పొందుతున్న రైతులు ఎవరైన బ్యాంక్ ఖాతా మార్చుకోవాలనుకుంటే కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు బుక్ జీరాక్స్‌లతో దరఖాస్తును ఆయా క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారులకు అందచేయాలని తెలిపారు.

నేడు రైతులకు అవగాహన

మునగాల : మండలంలోని ముకుందాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సేంద్రియ సాగుపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు నల్లా శ్రీపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో 125 మంది రైతులకు ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సేంద్రియ సాగుకు కావాల్సిన ఎరువులు మొదలైన వాటిని ప్రభుత్వం అందిస్తుందని, మూడేళ్ల సేంద్రియ వ్యవసాయం చేసిన రైతులకు ప్రభుత్వం సర్టిఫికెట్ ఇస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పబ్లిక్ నల్లాలు, బోరింగ్‌లు ఏర్పాటు చేయాలని వినతి

మునగాల : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పబ్లిక్ నల్లాలు, బోరింగ్‌లు ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఎంపీడీఓ రమేష్‌దీనదయాళ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పలు ప్రాంతాల్లో యాచకులు, మతిస్థిమితం లేనివారు, పేదలు నీళ్లను కొనుక్కోలేక ఇబ్బందులు పడుతున్నారని, మిషన్ భగీరథ పథకంలో భాగంగా పబ్లిక్ నల్లాలు ఏర్పాటు చేయాలన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

గరిడేపల్లి : క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నరేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని లచ్యతండాలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్షయ వ్యాధిపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఎస్.అంజయ్యగౌడ్, అశోక్, ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఏఎన్‌ఎం సైదమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- ఎన్‌ఎంఎంఎస్‌కు 8 మంది చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల ఎంపిక
- జిల్లాలో అత్యధికంగా ఇక్కడి నుంచే
- నాలుగేళ్లు విద్యార్థులకు స్కాలర్‌షిప్



ఎన్‌ఎంఎంఎస్‌లో జిల్లాలో అత్యధికంగా విద్యార్థులు ఎంపికైన చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాల

చిలుకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2008 నుంచి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పేరుతో నగదు ప్రోత్సాహం అందజేస్తోంది. 8వ తరగతి చదివే విద్యార్థులకు పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఈ ఉపకార వేతనానికి ఎంపిక చేస్తున్నారు. అయితే స్కాలర్‌షిప్‌కు చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రతి ఏడాది అధిక సంఖ్యలో విద్యార్థులు ఎంపికవుతున్నారు. జిల్లాలో టాపర్స్‌గా నిలుస్తున్నారు. ఈ ఏడాది సూర్యాపేట జిల్లాకు మొత్తం 73 సీట్లు కేటాయించగా అందులో చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులే అత్యధికంగా 8 మంది ఎంపికయ్యారు. ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు ప్రతి ఏడాది ప్రభుత్వం రూ.12వేలు చొప్పున వరుసగా నాలుగు సంవత్సరాల పాటు (9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తి) రూ. 48 వేలు స్కాలర్‌షిప్ అందజేస్తుంది.

ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు..

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యేలా చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులను ప్రతి ఏడాది ఉపాధ్యాయులు సన్నద్ధం చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి సలహాలతో రాష్ట్ర ఉత్తమ టీచర్, సైన్స్ ఉపాధ్యాయుడు కందిబండ రామారావు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాడు. ఆదివారాల్లో కోచింగ్, ప్రతిరోజూ అదనంగా గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ పాఠశాల నుంచి ఈ ఏడాది జిల్లా ప్రథమ, ద్వితీయ, ఏడు, పదిహేడవ ర్యాంకులు సాధించారు. 2010 నుంచి ఈ ఏడాది వరకు చిలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి మొత్తం 100 మందికి పైగా విద్యార్థులు ఎంపికయ్యారు.

ఇప్పటికి 100 మంది ఎంపిక



మా పాఠశాల నుంచి ఇప్పటివరకు 100 మంది విద్యార్థులకు పైగా ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. ఈ ఏడాది మా పాఠశాల నుంచే 8 మంది ఎంపికయ్యారు. సైన్స్ ఉపాధ్యాయుడు రామారావు ఇచ్చిన కోచింగ్‌తో విద్యార్థులు విజయం సాధించారు. విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఉంది.

– కరుణాకర్‌రెడ్డి, హెచ్‌ఎం, చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్

చాలా సంతోషంగా ఉంది



ఉపాధ్యాయుడు రామారావు శిక్షణతో ఉపకార వేతనానికి ఎంపికయ్యా. ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానం సాధించా. సార్ మాకు సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించారు. మెంటల్ ఎబిలిటీ ప్రశ్నలకు సులభతరంగా జవాబు రాయడం నేర్పడంతోనే పరీక్షలో జవాబు రాయగలిగా. జిల్లాలో ప్రథమ స్థానం రావడంతో చాలా సంతోషంగా ఉంది.

– బి.రవి, జెడ్పీహెచ్‌ఎస్,చిలుకూరు

టీచర్స్ ప్రోత్సాహంతో ఎంపికయ్యా



గైడ్ టీచర్‌తో పాటు ఉపాధ్యాయులు ప్రోత్సాహంతో ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యా. 8వ తరగతిలో మొదటి నెల నుంచే పరీక్షకు సన్నద్ధం చేయించారు. ప్రతి రోజూ టెస్టులు నిర్వహించారు. ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ స్కాలర్‌షిప్‌తో మా తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుంది.

– బి. చైత్ర, జెడ్పీహెచ్‌ఎస్, చిలుకూరు

ప్రణాళికతో కోచింగ్ ఇచ్చాం



విద్యార్థులకు ప్రణాళికతో కోచింగ్ ఇవ్వడంతో మంచి ర్యాంక్‌లు సాధించి ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాం. పిల్లలు మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది.

– కందిబండ రామారావు, ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్, చిలుకూరు

వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

కోదాడరూరల్ : వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీనియర్ సిటిజన్ వేల్ఫేర్ అసోసియేషన్ జిల్లా, కోదాడ పట్టణ అధ్యక్షులు బొల్లు రాంబాబు, గడ్డం నర్సయ్య కోరారు. వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కోదాడ పట్టణంలో సీనియర్ సిటిజన్ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల వయోవృద్ధులపై వేధింపులు, దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని, నిరాదరణకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వయోవృద్ధులను నిరాదరణకు గురిచేస్తున్న కుటుంబసభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ నాయకులు విద్యాసాగర్‌రావు, పాట్టా జగన్‌మోహన్‌రావు, వేనేపల్లి శ్రీనివాసరావు, రఘువరప్రసాద్, కృష్ణమూర్తి, కోటయ్య, సాంబులు, భిక్షం, రంగారావు, బాలేమియా తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వంద రోజులు పనులు కల్పించాలి

నడిగూడెం : వచ్చే వంద రోజుల్లో కూలీలకు పనులు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీఓ హరిసింగ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. ఏపీఓ రవీందర్, ఈసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

చిలుకూరు : జిల్లా వ్యాప్తంగా వచ్చే నెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని వ ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు కొండపల్లి ఆంజనేయులు మాదిగ తెలిపారు. శుక్రవారం చిలుకూరులో జరిగిన ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్, జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి సత్యారాజ్, మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరి బాబు, నాయకులు సిద్దెల శ్రీను, వీరస్వామి, రామారావు, ఉపేందర్, రాకేష్, శ్రీను, సైదులు, రాములు, తిరపయ్య, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే వంద రోజుల ప్రణాళిక



3వ వార్డులో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో కమిషనర్ అశోక్‌రెడ్డి, తదితరులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికే వంద రోజుల ప్రణాళిక కార్యక్రమం చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 3, 11వ వార్డుల్లో తడి, పొడి చెత్త వేరు చేయూ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వార్డుల్లో మురుగు కాలువల పూడికతీత పనులను దగ్గరుండి చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



మునగాల : మాధవరంలో మాట్లాడుతున్న కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ

మునగాల : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ సూచించారు. శుక్రవారం మండలంలోని మాధవరం రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. తహసీల్దార్ బి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎస్‌ఎంపేటలో జరిగిన సదస్సులో 117 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కాగా, నూతనంగా తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎలక నరేందర్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో మండల ఆర్‌ఐ ఎన్.రామారావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై 549 దరఖాస్తులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చింతలపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో వివిధ భూ సమస్యలపై 549 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు వాసుదేవరావు, ఆత్రేయ, రెవెన్యూ సిబ్బంది, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

భూసమస్యలపై దరఖాస్తుల వెల్లువ

అనంతగిరి : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు వెల్లువెత్తాయి. మండలంలోని 9 గ్రామాల రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు ఇచ్చారు. వారసత్వం, భాగపంపిణీ, సర్వేనంబర్ మార్పులు చేర్పుల వంటి సమస్యలపై సుమారు 535 దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.హిమబిందు, ఆర్‌ఐ వెంకటనగేష్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

గరిడేపల్లి : మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అడ్మిషన్ల కోసం శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లెక్చరర్ సైదులు మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రణతి, వెన్నెల, అపర్ణ, నాన్‌టీచింగ్ స్టాఫ్ సుశాంత్, రణపంగ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వాతావరణం యువత భవిష్యత్‌ను ప్రభావితం చేస్తుంది



మాట్లాడుతున్న ఎస్‌ఐ సందీప్ రెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : గ్రామ వాతావరణం మన పిల్లలు, యువత భవిష్యత్‌ను ప్రభావితం చేస్తుందని ఎస్‌ఐ సందీప్ రెడ్డి అన్నారు. శుక్రవారం చింతలపాలెం మండలం దొండపాడులో సైబర్ నేరాలలు, ఆన్ లైన్ బెట్టింగ్, గంజాయి, మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాలపై పోలీస్ కళాబృందంతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంత వాతావరణం, శాంతి భద్రతలు అదుపులో ఉంటే యువత అభివృద్ధి పథంలో నడుస్తారని అన్నారు. సమస్యాత్మక గ్రామంగా పోలీస్ రికార్డులలో ఒకసారి నమోదైతే ఆ పేరు ఎప్పటికీ అలాగే నిలిచి పోతుందన్నారు. యువత ఒక్కసారి కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్‌లో ఉద్యోగాలు పొందే విషయంలో, విదేశాలకు వెళ్లేటప్పుడు, పాస్‌పోర్ట్, విసా పొందే విషయంలో పోలీసుల అనుమతులు రావని ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, శంకర్, నాగరాజు, శ్రీను, సురేష్, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



సంతాపం తెలుపుతున్న లియాఫీ సభ్యులు

కోదాడరూరల్ : అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద మృతులకు కోదాడ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) ఏజెంట్ల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం కోదాడలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదంలో సామాన్యులు, వ్యాపారులతో పాటు మంచి భవిష్యత్ ఉన్న వైద్య విదార్థులు మృతి చెందడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో లియాఫీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సోందువియా, సంజీవయ్య, రాము, వెంకటాద్రి, ప్రభాకర్ రెడ్డి, బోళ్ల వీరారెడ్డి, సుబ్రహ్మణ్యం, అహ్మద్‌అలీ, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

రైలులో నుంచి జారిపడి మృతి

- మృతుడిది పాలకీడు మండలం గుండెబోయినగూడెం



మృతిచెందిన శ్రావణ్‌కుమార్

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెండ్యాల్–నష్కల్ రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం ఓ వ్యక్తి రైలులో నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సామంతపూడి శ్రవణ్‌కుమార్ (36) ఆంధ్రప్రదేశ్ మంగళగిరిలోని ఎయిమ్స్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు జనరల్ టికెట్ తీసుకొని హౌరా (ఈస్ట్‌కోస్ట్) ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. పెండ్యాల్–నష్కల్ రైల్వే స్టేషన్‌ల మధ్యలో ప్రమాదవశాత్తు రైలులోనుంచి జారి పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి స్వస్థలం సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం గుండెబోయినగూడెం. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బంధువులకు సమాచారం అందించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అనంతగిరి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం రాత్రి రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని గోండ్రియాల శివారులోని పాలేరు వాగు నుంచి పైడిపల్లి అశోక్ తన ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా గోండ్రియాల శివారులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోలంపల్లి వెంకటనగేష్ పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను అనంతగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించి ఇసుక అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. ఈమేరకు శుక్రవారం పైడిపల్లి అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు అనంతగిరి ఎస్‌ఐ నవీన్ కుమార్ తలిపారు.

విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం

- ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ హేమచందర్



నేరేడుచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న డిప్యూటీ సెక్రటరీ హేమచందర్

నేరేడుచర్ల : ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే ప్రధాన లక్ష్యమని ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ హేమచందర్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి, కళాశాలలో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో కళాశాలలో 150 మంది విద్యార్థులను చేర్పించాలనే లక్ష్యంతో అధ్యాపకులు ముందుకు వెళ్లాలన్నారు. ఆయన వెంట కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మద్దిమడుగు సైదులు, అధ్యాపకులు వెంకన్న, శ్రీనివాస్, నరేందర్, ప్రణతి, సునిత, అంజయ్య, నర్సింహాచారి, గణేష్, ప్రసాద్, వీరునాయక్, వెన్నెల, అపర్ణ, గ్రంథాలయ సిబ్బంది జానకిరాంరెడ్డి, అన్వేష్, సుశాంత్ తదితరులున్నారు.

విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

నడిగూడెం : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ హేమచందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి, అధ్యాపకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయనాయక్, అధ్యాపకులు ఉన్నారు.

విపత్తు నిర్వహణ టీమ్ ఏర్పాటు

హుజూర్‌నగర్ : ఆకస్మిక వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యగా హుజూర్‌నగర్ పురపాలక సంఘం పరిధిలో విపత్తు నిర్వహణ టీమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఏమైన అత్యవసరమైతే టీమ్ సభ్యులను సంప్రదించాలని తెలిపారు. టీమ్ సభ్యులు అశోక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెల్ నంబర్ 9032736373, ఎ.వెంకటేశ్వర్లు, శానిటరీ జవాన్ సెల్ నంబర్ 9110529891, వి.శ్రీనివాసరావు, శానిటరీ జవాన్ సెల్ నంబర్ 7981818882, ఐ.సీతారాములు, శానిటరీ జవాన్, సెల్ నంబర్ 9908430376 తో పాటు మున్సిపల్ సిబ్బంది ఎం.దుర్గారావు, కె.సైదులు, ఎన్.రాము, జి.వీరబాబు, పి.కిషన్, పి.శ్రీనును సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ఏఎంసీ పాలకవర్గ సమావేశం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సాధారణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నెలల ఆదాయ వ్యయాలను పరిశీలించారు. మేళ్లచెరువు, చింతలపాలెం మండల కేంద్రాల్లో సబ్ మార్కెట్ యార్డు కోసం 3 నుంచి 5 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని, గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని, తదితర తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో చైర్‌పర్సన్ దేశ్‌ముఖ్ రాధిక, జిల్లా మార్కెటింగ్ అధికారి శర్మ, సభ్యులు సైదిరెడ్డి, శ్రీనివాసరావు, వెంకన్న, నాగేశ్వరరావు, కొండారెడ్డి, జానకిరాములు, కోటయ్య, రాయ్‌సాల్, వెంకటరెడ్డి, రామచంద్రయ్య ఏడీ ఏ రవి, ఇన్‌చార్జ్ ఉన్నత శ్రేణి కార్యదర్శి రఘుపతిరెడ్డి, ద్వితీయ శ్రేణి కార్యదర్శి గని, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



హుజూర్‌నగర్ : సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న ఎంఈఓ సైదానాయక్



హుజూర్‌నగర్‌రూరల్ : విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

గరిడేపల్లి : ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి చత్రునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని సర్వారం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులను ఆయన యూనిఫాం, పాఠ్యపుస్తకా లు అందజేసి మాట్లాడారు. ఈ పాఠశాల ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడంతో హెచ్‌ఎం కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కాగా, గురుకుల సీట్లు పొందిన విద్యార్థులకు మాజీ సర్పంచ్ సాముల వెంకట్‌రెడ్డి తన తల్లిదండ్రులు సాముల లచ్చిరెడ్డి, జానమ్మ, భార్య సాముల కళావతి జ్ఞాపకార్థం మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మ న్ త్రివేణి, ప్రధానోపాధ్యాయుడు మేకల రా జారావు, ఉపాధ్యాయులు గోవిందు, సైదులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, రామిరెడ్డి, సత్యనారా యణరెడ్డి, కోటిరెడ్డి, సీతయ్య, గోపయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

హుజూర్‌నగర్ : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ సైదానాయక్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ముత్యాల వీధి ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. హెచ్‌ఎం రామతారకం, ఉపాధ్యాయులు కళావతి, షర్మిల, స్వర్ణలత, సీఆర్‌పీ బ్రహ్మం, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, రజని, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలకు..

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బొల్లం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కరక్కాయలగూడెం గ్రామంలో ప్రైవేటు పాఠశాల నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరిన 8 మంది విద్యార్థులకు శుక్రవారం ఆయన అడ్మిషన్లు ఇచ్చి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ వెంకటలక్ష్మి, తదితరులు

చిలుకూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచాలని ఐసీడీఎస్ హుజూర్‌నగర్ సెక్టార్ సీడీపీఓ వెంకటలక్ష్మి సూచించారు. అంగన్‌వాడీ బడిబా ట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిలు కూరు మండలంలోని బేతవోలులో గల అంగన్‌వాడీ సెంటర్– 4లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఉపేంద్ర, సునిత, గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం

మఠంపల్లి : యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా మాస్టర్ నరసింహారెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది యోగాసనాలు సాధన చేశారు. మండల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావ్య, నవ్య, యోగా మాస్టర్ రామానుజ, పీహెచ్‌ఎన్ కళావతి, హెచ్‌ఈవో ప్రభాకర్, సూపర్‌వైజర్లు రవి, నాగేంద్రమ్మ, హెల్త్ అసిస్టెంట్లు బెల్లంకొండ శ్రీనివాసరావు, భాస్కర్, ఎంఎల్‌హెచ్‌పీలు డాక్టర్ కళ్యాణి, సరిత, లోకేశ్వరి, ఏఎన్‌ఎంలు నిర్మల, చంద్రకళ, సక్కుబాయి, వాణి, రజిని, సైదమ్మ, సీతమ్మ, సరిత, సిబ్బంది, ఆశా వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



బూరుగడ్డ– హుజూర్‌నగర్ డొంక రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రాధిక

హుజూర్‌నగర్‌రూరల్ : రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాధికఅరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ అన్నారు. మండలంలోని బూరుగడ్డ నుంచి హుజూర్‌నగర్ మధ్య గల డొంకరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ రోడ్డు విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన నిధులు మంజూరు చేయించగా వెంటనే పనులు ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. అలాగే నల్లచెరువు కట్టపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఆమె వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, కార్యదర్శి గిరిజాకుమారి, నాయకులు, రైతులు ఉన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి సేవించిన యువకులు ?

అనంతగిరి : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో గంజాయి సేవించే యువకులను శుక్రవారం అనంతగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

హుజూర్‌నగర్ : పట్టణంలోని మట్టపల్లి బైపాస్ రోడ్డులో గల శ్రీగోదా, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి మంగళవారం వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. 14న శ్రీవారి మూలమూర్తికి నవకలశ అభిషేకం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం , అంకురార్పణ, యాగశాల ప్రవేశం తదితర పూజలు నిర్వహిస్తారు. 15న గరుడహోమం, సూర్య ప్రభ వాహన సేవ, సంతానార్థులకు గరుడ ప్రసాదం పంపిణీ, తదితర పూజలు చేస్తారు. 16న వేదపండితు మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీగోదా, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం, తీర్థప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. 17న స్వామి, అమ్మవార్లు, ఆళ్వారుల శోభాయాత్ర వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.